7

సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024

ఊరూరా పొలాల పండుగ

జిల్లా వ్యాప్తంగా పొలాల అమావాస్యను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఊరూరా ఎద్దులను అందంగా ముస్తాబు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

- వివరాలు 9లో ▸



నేరడిగొండ: ఎద్దులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, వారి కుటుంబ సభ్యులు

న్యూస్‌రీల్

28న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి ప్రభాకరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్జి చాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు పాల్గొని కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమయంతో పాటు డబ్బులు సైతం ఆదా అవుతాయని పేర్కొన్నారు. పోలీసులు, బ్యాంకు, ఇన్సురెన్స్ అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి ఈసారి 3,550 కేసులను గుర్తించినట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు

కైలాస్‌నగర్: నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, గడిచిన పదేళ్లలో దేశంలో నిత్యావసర ధరలు మూడింతలయ్యాయని ఆరోపించారు. వీటిని అదుపు చేయడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో పార్టీ నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించాలి

కైలాస్‌నగర్: మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను విధిగా సందర్శించి రిజిస్టర్లను పరిశీలించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేకాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేకాధికారులు ప్రతీవారం తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించడంతో పాటు అకడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌పై దృష్టి సారించాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నాణ్యత పరిశీలించాలన్నారు. అనంతరం ఈ నెల 1నుంచి 30వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించనున్న పోషణ్ అభియాన్ కార్యక్రమంపై సమీక్షించి పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో సాయన్న, డీఈవో ప్రణీత, డీడబ్ల్యూవో సబిత, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

'రూం టు రీడ్' ప్రచార రథం ప్రారంభం

కైలాస్‌నగర్: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేలా రూం టు రీడ్ అనే ఎన్జీవో మేక్ రూం ఫర్ ఎర్లీ లర్నింగ్ నినాదంతో రీడింగ్ క్యాంపెయిన్ చేపడుతుంది. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని కలెక్టర్ రాజర్షి షా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అందులో పుస్తకాలతో ఏర్పాటు చేసిన లైబ్రరీని ఆయన పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రచార రథాన్ని తిప్పుతూ విద్యార్థులకు రీడింగ్‌పై ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ఇందులో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో సాయన్న, డీడబ్ల్యూవో సబిత, డీఎల్‌పీవో ఫణీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సైబర్ నేరాలపై ఎన్‌సీసీ కేడెట్లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి వచ్చే ఫేక్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీ4సీ సిబ్బంది సూచించారు. అలాగే యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి అంశాలను వివరించారు. ఇందులో సిబ్బంది సంతోష్ తదితరులున్నారు.

ఆగని వాన



ఇది కొరాట–చనాఖ బ్యారేజ్. లోయర్ పెన్‌గంగ నది భూభాగంపై నిర్మించిన ప్రాజెక్ట్. పూర్తిస్థాయి నీటి మట్టం 113 మీటర్లు. ప్రస్తుతం 110 మీటర్ల ఎత్తున వరద ప్రవహిస్తుంది. ప్రాజెక్టుకు ఉన్న 26 గేట్లు తెరిచారు. ఆదివారం రాత్రి 2.5 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగింది. సోమవారం సాయంత్రం వరకు లక్ష క్యూసెక్కులకు చేరింది. గతేడాది ఈ బ్యారేజ్ 4.5 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని తట్టుకుంది.



ఇది పెన్‌గంగ నదిపైన జైనథ్ మండలం ఆనంద్‌పూర్, మహారాష్ట్రలోని దిగ్రస్ మధ్య అంతర్రాష్ట్ర రహదారి. ఆదివారం ఈ వంతెన పైనుంచి వరద ప్రవహించింది. సోమవారం పూర్తిగా వంతెనను ముంచెత్తింది.

ఇది నేరడిగొండ మండలం సేవ్‌దాస్‌నగర్‌లోని ఓ పత్తి చేను. వరద నీరు ఇలా పంట చేనును ముంచెత్తింది. జైనథ్, బేల, ఉట్నూర్, భీంపూర్ మండలాల్లోనూ ఇదే పరిస్థితి.





ఇది భీంపూర్ మండలంలోని అంతర్‌గాం వద్ద లోలెవల్ వంతెన. వరద ప్రవాహం జోరుగా కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోని అనేక లోలెవల్ వంతెనలపై ఇదే పరిస్థితి.



ఇది బేల మండలంలోని దేవుజీగూడ గ్రామంలో బ్రిడ్జిని ఆనుకొని ఉన్న రహదారి. వరద నీటి తాకిడికి తెగిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇలా జిల్లాలోని అనేక రోడ్లు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి.



పెన్‌గంగ బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది



జైనథ్ మండలంలోని ఉమ్రి, బేల మండలంలోని సాంగిడి గ్రామాలను జిల్లా విపత్తుల నివారణ సంస్థ సిబ్బంది సోమవారం సందర్శించారు. ఈ గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అభద్రతభావానికి లోను కావద్దని, అత్యవసర పరిస్థితుల్లో తాము వెంటుంటామని ఇటు పోలీసులతో పాటు అటు డీడీఆర్ఎఫ్ సిబ్బంది గ్రామస్తులకు భరోసానిచ్చారు.

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- నిండుకుండలా జలాశయాలు
- చేలను ముంచెత్తిన వరద
- పలుచోట్ల దెబ్బతిన్న రహదారులు
- పెన్‌గంగకు కొనసాగుతున్న ప్రవాహం

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. కొంత తెరపి ఇస్తున్నా వాన కురుస్తూనే ఉంది. ప్రధానంగా రాత్రి పూట వర్షం దంచి కొడుతుంది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి. సోమవారం జిల్లా వ్యాప్తంగా సగటున 48.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు సాధారణం 847.5 మి.మీ.లు కాగా, 962.0 మి.మీ.ల వర్షపాతం కురిసింది. ఇక జిల్లావ్యాప్తంగా 392 చెరువులు ఉండగా, అన్నీ అలుగు పారుతున్నాయి. సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి. ఎగువన మహారాష్ట్ర నుంచి వరద కారణంగా పెన్‌గంగ ఉధృతి కొనసాగుతుంది.

చేలల్లోకి వరదనీరు..

జైనథ్ మండలంలోని పెండల్‌వాడ, సాంగ్వి, ఆనంద్‌పూర్ గ్రామాల్లో పెన్‌గంగ బ్యాక్ వాటర్ కారణంగా పంట చేలను వరద నీరు చుట్టుముట్టింది. ఈ మండలంలో 575 ఎకరాల్లో ఈ పరిస్థితి ఉంది. అలాగే తలమడుగులో 50, తాంసిలో 74, భీంపూర్‌లో 245, బేలలో 445, గాదిగూడలో 60, ఉట్నూర్‌లో 400 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో పత్తి 1,550 ఎకరాలు, సోయాబీన్ 220, కందులు 25, మొక్కజొన్న 45 ఎకరాల్లో నీట మునిగాయి.

చేలల్లోకి చేరిన వరద నీరు.. (వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా)
మండలాలు : 7 (జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్, బేల, గాదిగూడ, ఉట్నూర్)
గ్రామాలు : 41
రైతుల సంఖ్య: 720
ఎకరాలు : 1,849

రాకపోకలు బంద్..

బోథ్ మండలంలోని నక్కలవాడ, ధన్నూర్, పార్డి (బి)గ్రామసమీపంలోని వాగులు, వంతెనలపై నుంచి వరద పొంగింది. దీంతో 19గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బజార్‌హత్నూర్ సమీపంలో లోలెవల్ వంతెనల పైనుంచి వరద కొనసాగుతుంది. ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. సిరికొండ మండలం వాయిపేట్ చెరువు కట్ట తెగిపోవడంతో సమీపంలోని రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో సుమారు 8 గ్రామాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జైనథ్‌మండలం కామాయి గ్రామాన్ని వరద చుట్టుముట్టింది. దీంతో ఆ గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటన..

వరద ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటిస్తున్నారు. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం సోమవారం పెన్‌గంగ బ్రిడ్జిని పరిశీలించారు. వరద ప్రవాహాన్ని వీక్షించారు. జైనథ్ మండలంలోని కామాయి గ్రామాన్ని వరద చుట్టుముట్టడంతో అక్కడి మాజీ సర్పంచ్‌తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడుతూ.. వైద్య అత్యవసర పరిస్థితులు ఉంటే తెలియజేయాలని చెప్పారు. అలాగే గ్రామంలో రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జైనథ్ మండలంలో పర్యటించారు. పంట చేలల్లోకి చేరిన వరదను పరిశీలించారు. రైతులకు భరోసానిచ్చారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు.. (ఆగస్టు 2న ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)	
ప్రాంతం	వర్షపాతం (మి.మీ.లలో)
నేరడిగొండ	48.5
గుడిహత్నూర్	40.5
బజార్‌హత్నూర్	32.0
అర్లి(టి)	26.0
ఇచ్చోడ	20.5
సిరికొండ	16.5
భోరజ్	15.8
సొనాల	15.3

కంట్రోల్‌రూంను తనిఖీ చేసిన కలెక్టర్

కైలాస్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో 18004251939 నంబర్‌తో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్‌రూంను కలెక్టర్ రాజర్షి షా సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని ఫోన్ కాల్స్ వచ్చాయనే వివరాలను ఆరా తీశారు. టోల్ ఫ్రీ నంబర్ పనిచేస్తుందా లేదా అనే విషయం తెలుసుకునేందుకు ఆయన అక్కడి నుంచే స్వయంగా ఫోన్ చేశారు. భారీవర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. మున్సిపల్ పరిధిలోని శిథిలభవనాలు, ఇళ్లు, గోడలు వర్షానికి కూలిపోయే దశలో ఉన్నవాటిని గుర్తించి అందులో ఉన్న వారిని ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఓపెన్ బావుల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలుతీసుకోవాలన్నారు. బాధితులు కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండలం, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, విద్యుత్‌శాఖల కంట్రోల్‌రూమ్ నంబర్లను సంప్రదించి సాయం పొందవచ్చని తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పెన్‌గంగ ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జైనథ్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సోమవారం వారు మండలంలోని డొల్లార గ్రామం వద్దకు చేరుకొని పెన్‌గంగ ఉధృతిని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి కామాయి గ్రామానికి చేరుకొని లోలెవల్ వంతెనను పరిశీలించారు. వంతెనపై నుంచి వరద పారుతుండడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు వారు మాజీ సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నిత్యావసర సరుకులు, మందులు లభ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహసీల్దార్ శ్యాంసుందర్, సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, తదితరులున్నారు.

గ్రీవెన్స్‌కు 'పొలాల' ఎఫెక్ట్

- 'ప్రజావాణి'కి స్పందన అంతంతే..



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తుండగా ఈ వారం పొలాల పండుగ ప్రభావం కనిపించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ ఈసారి అర్జీదారులు లేక వెలవెలబోయింది. వచ్చిన పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈవారం అందిన 35 అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలను గుర్తించాలని జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వివిధ శాఖల తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నాం



ఆదిలాబాద్ పట్టణం ఖానాపూర్ శివారు సర్వేనంబర్ 68/త లోని లేఅవుట్‌లో 1995లో ప్లాట్లను కొనుగోలు చేశాం. వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇళ్లు సైతం నిర్మించుకుని నివసిస్తున్నాం. అయితే 2018–19లో ఆ భూమిని అప్పటి తహసీల్దార్ డబ్బులకు ఆశపడి బొజ్జా లసుంబాయి పేరిట రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో మేము బ్యాంకు రుణాలను పొందలేకపోతున్నాం. రికార్డుల్లో నుంచి ఆ పేరు తొలగించి మా సమస్య పరిష్కరించాలి.

– సర్వేనంబర్ 68/త బాధితులు

విద్యాసంస్థలకు నేడు సెలవు

కైలాస్‌నగర్: అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సెలవు పాటించాలని సూచించారు.

పేదల ఆరోగ్య ప్రదాత వైఎస్సార్



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కైలాస్‌నగర్: ఆరోగ్యశ్రీ పథకం అమలుతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పాలిట ఆరోగ్య ప్రదాతగా నిలిచారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పార్టీ ఆధ్వర్యంలో సోమవారంఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో రిమ్స్ ఆసుపత్రి సేవలు వైఎస్సార్ పుణ్యమేనన్నారు. ఆ మహానేత హయాంలోనే మత్తడివాగు ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. ఇందులో నాయకులు జహీర్ రంజాని, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల మదినిండా మహానేత వైఎస్సార్

ఆదిలాబాద్‌టౌన్:దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల మదిలో పదిలంగా ఉన్నారని వైఎస్ఆర్ అభిమాని బెజ్జంకి అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద రా జశేఖరరెడ్డి విగ్రహానికి సోమవారం పూలమాలలు వే సి నివాళులర్పించారు. పేదలకు రాజశేఖరరెడ్డి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆ మహానేత ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు.



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అనిల్

నచ్చినప్పుడే వస్తారు..!

- 'డైట్'లో పలువురు చుట్టపుచూపు ఉద్యోగులు
- హాజరు కోసం నెలకోసారి దర్శనం
- ఓ ఉద్యోగి నెల గైర్హాజరైనా అటెండెన్స్ మాత్రం ఓకే..!
- మరో ఉద్యోగి పక్షం రోజులు రాకపోయినా అదే తంతు..
- పొరుగు జిల్లాలో ఉంటూ విధులకు తరచూ డుమ్మా
- 'ఇన్‌చార్జి' పర్యవేక్షణ అస్తవ్యస్తం



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల



అటెండెన్స్ రిజిస్టర్‌లో సిబ్బంది సంతకాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల కొంతమంది ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా మారింది. ఇక్కడ పనిచేసేందుకు పలువురు ఉవ్విల్లూరుతుంటారు.. ఎందుకంటే రెగ్యులర్ అధికారి లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. విధులకు గైర్హాజరైనా ఎవరు ఏమనరు.. నచ్చినప్పుడే వచ్చి, వెళ్లే అవకాశం ఉంటుందనే భావన వారిలో కనిపిస్తోంది. ఓ జూనియర్ అసిస్టెంట్ రెండేళ్లుగా విధులకు గైర్హాజరవుతున్నా రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు కనబడుతుంటాయి. మరో ఉద్యోగి ఉదయం 11.30 దాటితే గాని డైట్‌కు రాలేడు. ఇదేమిటని అడిగితే తనకు స్పెషల్ పర్మిషన్ ఉందని చెప్పుకొస్తాడు. ఇటీవల నిర్మల్ జిల్లా నుంచి ఇక్కడికి పదోన్నతిపై వచ్చిన ఉద్యోగి సైతం నెలరోజుల్లో ఒకట్రెండు సార్లు మాత్రమే కళాశాలకు హాజరయ్యాడు. అయితే ఇటీవల ఆయన డైట్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోవడం గమనార్హం. ఇలా కొంతమంది ఉద్యోగుల తీరుతో మిగతా సిబ్బంది సైతం సమయపాలన పాటించకపోవడం, విధులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఇక్కడ పనిచేసే పలువురు ఉద్యోగుల తీరు ఆడిందే ఆటా.. పాడిందే పాటగా మారిందనే విమర్శలున్నాయి.

నెలల తరబడి రాకపోయినా హాజరు..

ప్రభుత్వ డైట్ కళాశాలలో ఒక సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరితోపాటు ఆరుగురు అటెండర్లు పనిచేస్తున్నారు. ఇందులో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండర్ డిప్యూటేషన్‌పై డీఈవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే నిర్మల్ నుంచి వచ్చే కొంతమంది మాత్రం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఓ జూనియర్ అసిస్టెంట్ రెండేళ్లుగా కళాశాలలో విధులకు హాజరుకాకున్నా ఎప్పుడోసారి మధ్యాహ్న వేళలో కారులో వచ్చి సంతకాలు పెట్టి వెనుదిరగడం ఆయనకు పరిపాటిగా మారిందనే ఆరోపణలున్నాయి. ఆయనతో పాటు ఇటీవల ఇక్కడికి బదిలీపై వచ్చిన ఓ ఉద్యోగి సైతం విధులకు గైర్హాజరవుతున్నారు. నిర్మల్ నుంచి వచ్చే మరో ఉద్యోగి ఉదయం 11.30 గంటలు దాటితే గాని కళాశాలకు రావడం లేదని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఇదేమిటని వారు ప్రశ్నిస్తే.. మీకు ఇక్కడ పనిచేసేది ఉందా.. లేదా అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొంటున్నారు. మరో ఉద్యోగి జనవరిలో నెలరోజులు రాకపోయినా రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు ఉండడం గమనార్హం. ఇంకో ఉద్యోగి సొంత పనుల కోసం 15రోజుల పాటు గైర్హాజరైనా రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు చేసినట్లు తెలుస్తుంది. దీనికి తోడు విధులకు తరచూ గైర్హాజరవుతూ నిర్మల్ డీఈవో కార్యాలయంలో పని ఉందంటూ ఆన్‌డ్యూటీ వేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గాడితప్పిన పర్యవేక్షణ

డైట్ కళాశాలకు కొన్నేళ్లుగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ పోస్టు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో పర్యవేక్షణ గాడితప్పిందనే విమర్శలున్నాయి. ఇక్కడ పనిచేసే ఇద్దరు లెక్చరర్లలో ఒకరు నిర్మల్ డీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. మరో లెక్చరర్ హన్మకొండ ఇన్‌చార్జి డీఈవోగా పనిచేస్తున్నారు. ఒక ఈఎల్‌టీసీ మాత్రమే రెగ్యులర్ ఉన్నారు. 11 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. అయితే పర్యవేక్షణ అధికారి అందుబాటులో లేకపోవడంతో కళాశాలతో పాటు కార్యాలయంలో పాలన నిర్వహణ అస్తవ్యస్తంగా మారినట్లు తెలుస్తోంది. ఈ విషయమై డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

కృష్ణ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణ ఎక్స్‌ప్రెస్ (17206) సర్వీసు రద్దు చేస్తున్నట్లు ద.మ రైల్వే ఓ ప్రకటనలో పేర్కొంది. మంగళవారం ఈ సర్వీసు రద్దు చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరింది.

పలు రూట్లలో బస్సులు నిలిపివేత

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు సోమవారం తాత్కాలికంగా రద్దయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఒంగోలు, గుంటూరు వెళ్లే సర్వీసును ఖమ్మం వరకు మాత్రమే నడుపుతున్నట్లు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల-జగిత్యాల మధ్య నడిచే 5 సర్వీసులు, భైంసా పరిధిలో ఓలా, నిగ్వా వంటి రూట్లలో తాత్కాలికంగా బస్సులు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

చోరీకి యత్నించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల మయూర్ సుభాష్ ఇంట్లో టీచర్ కుటుంబం అద్దెకు ఉంటోంది. ఈనెల 1న ఆ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియబాద్‌కు చెందిన షాదాబ్‌తోపాటు మరో ఇద్దరు సోను, దిలీప్‌లు ఇంటి తాళం పగలగొట్టి చొరబడ్డారు. గమనించిన ఇంటి యజమాని రావడంతో వారు పరారయ్యారు. యజమాని ఫిర్యాదుతో సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. రైల్వేస్టేషన్‌లో అనుమానం వచ్చి షాదాబ్‌ను విచారించగా చోరీకి యత్నించినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితులు పట్టణంలోని కృష్ణా లాడ్జిలో అరుణ్ అనే నకిలీ ఆధార్ కార్డుతో రూమ్ అద్దెకు తీసుకున్నట్లు వివరించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదివారం పట్టుబడ్డ నిందితుడు షేక్ కలీమ్‌ను రిమాండ్‌కు తరలించగా, సోమవారం మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన హనుమాన్ ధర్మాజీను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈయన ఆదిలాబాద్‌లోని మార్కెట్ యార్డు సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 52 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి మేకల నిర్విజ్ఞపై సోమవారం కుక్కలు దాడి చేశాయి. మధ్యాహ్న సమయంలో ఇంటి ఆవరణలో పువ్వులు తెంపడానికి వెళ్లిన చిన్నారి వద్దకు నాలుగు కుక్కలు ఎదురుగా వచ్చాయి. ఒక కుక్క దాడిలో గాయపడిన చిన్నారి కేకలు వేసింది. వెంటనే పరిగెత్తుకుని వచ్చిన కుటుంబీకులు ఆమెను కాపాడారు. అప్పటికే చిన్నారికి పలుచోట్ల గాయమైంది. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా, కాలనీకి చెందిన ఓ వ్యక్తి 14 కుక్కలు పెంచుతున్నాడని తెలిపారు. వీధి కుక్కల విషయంలో మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఎందుకు బిడ్డా.. ఇంతపని చేసుకున్నరు..!



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన..
- తల్లిదండ్రుల రోదనలు వర్ణనాతీతం
- కన్నీటి మధ్య ముగిసిన అంత్యక్రియలు
- మృతుల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మంచిర్యాలక్రైం: ''ఎందుకు బిడ్డా ఇంత పని చేసుకున్నరు.. మేమున్నం. ఎన్ని అప్పులున్నా తీర్చుకుందామని చెప్పితిమి కదా.. బిడ్డా పిల్లలు ఏం పాపం చేశారు. ఎందుకిలా చేశావు..'' అంటూ ఆ తల్లి రోదించిన రాజేశ్వరి తీరు కాలనీ వాసులను కంటతడి పెట్టించింది. మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఇప్ప కొమురయ్య, రాజేశ్వరి దంపతుల కుమారుడు వెంకటేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పుల పాలు కావడం,



వెంకటేష్ తల్లి రాజేశ్వరిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

వెంకటేష్ శనివారం రాత్రి తన భార్య, ఇద్దరు పిల్లలకు విషమించి తానూ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. వెంకటేష్, అతడి భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్(11), విహాంత్(3) మృతదేహాలు సోమవారం ఉదయం మంచిర్యాలలోని ఇంటికి తీసుకొచ్చారు. ఇంటి ఎదుట నలుగురి మృతదేహాలను వరుసగా ఉంచిన తీరుతో స్థానికులు కంటతడి పెట్టారు. చివరి చూపు కోసం బంధువులు, కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాలనీ మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి. ''గణేష్ పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన బిడ్డా..'' అంటూ వర్షిణి తల్లి పద్మ రోదించిన తీరు అక్కడున్నవారిని ఆవేదనకు గురి చేసింది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ సంజీవ్.. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలకు ఆటంకం

మంచిర్యాల పట్టణంలో ఎవరు చనిపోయినా అంత్యక్రియలకు గోదావరి నదీ తీరంలోనే నిర్వహిస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అంత్యక్రియలకు స్థలం లేకుండా పోయింది. దీంతో అండాలమ్మ కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో సత్తా



పోటీల్లో సత్తా చాటిన శిశుమందిర్ విద్యార్థులు

ముధోల్: ముధోల్ శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటారని ప్రధానాచార్యులు సారథిరాజు తెలిపారు. మంచిర్యాల జిల్లా చౌక్కా రాంపూర్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొన్న పదోతరగతి విద్యార్థిని ఆర్.ప్రత్యూష అండర్ 17లో ట్రిపుల్ జంప్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకుంది. వంద మీటర్ల పరుగుల పందెంలో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది. పాఠశాలకు చెందిన బి.వీణ అండర్ 14 హార్డిల్స్‌లో తృతీయ స్థానం, ఎస్.సారిక అండర్-14 హైజంప్‌లో తృతీయ స్థానం సాధించారు.



గోల్డ్, సిల్వర్ మెడల్‌లతో విద్యార్థులు

కరాటే, తైక్వాండో, కుంగ్‌ఫూలో ప్రతిభ

ఖానాపూర్: ఓపెన్ నేషనల్ కరాటే, తైక్వాండో, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లో ఆదివారం జరిగాయి. పోటీల్లో ఖానాపూర్, కడెం మండలాల విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ మనోహర్ తెలిపారు. బీర్నంది జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన నాగచైతన్య, ప్రవళిక, వాసు విద్యాలయానికి చెందిన అక్షర్, సాయితేజ, బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన యుక్తిగ గోల్డ్‌మెడల్స్ సాధించారు. లింగాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన శ్రీజ, మేఘన, బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన రితీశ్‌యాదవ్, శాంతినికేతన్ పాఠశాలకు చెందిన చరణ్‌తేజ్ సిల్వర్‌మెడల్స్ సాధించారు.

కళాకారుడికి పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న డా.వేణుగోపాలకృష్ణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన లఘుచిత్రాల కళాకారుడు, వైద్యుడు డా.వేణుగోపాలకృష్ణకు ఉత్తమ నటుడు పురస్కారం లభించింది. హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్స్‌లో 24 ఫ్రేమ్స్ మీడియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాలకృష్ణకు ప్రముఖ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్ జ్ఞాపికను అందజేశారు. వేణుగోపాలకృష్ణ స్వీయ దర్శకత్వంలో నటించిన 'ప్రేమతో నాన్న..' లఘుచిత్రానికిగానూ గతంలోనే ప్రశంసలు, పురస్కారాలు దక్కాయి. తాజాగా ఉత్తమ పురస్కారం పొందటంపై జిల్లాకు చెందిన టీవీ, చలనచిత్ర, లఘుచిత్రాల కళాకారులు ఆయనను అభినందించారు.

వ్యవసాయ వర్సిటీ ఆవిర్భావ వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం పదో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో గల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్ మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆచార్య ఎన్జీ రంగ యూనివర్సిటీ నుంచి విడిపోయిందని పేర్కొన్నారు. వర్సిటీ ప్రధాన భాగాలైన బోధన, పరిశోధన, విస్తరణ అంశాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి రాంప్రసాద్, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, బోధన సిబ్బంది రాజేశ్వర్, భానురేఖ, అనిత, సురేష్, సునీల్ కుమార్, రాకేష్, సింధు, మౌనిక, అపూర్వ, సాయికిరణ్, ప్రీతంరెడ్డి, శ్రీకాంత్, గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న కళాశాల డీన్ శ్రీధర్ చౌహాన్

గోపికి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న గోపి

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, నటుడు, సామాజికవేత్త గోపిని శ్రీనివాస మెమోరియల్ అవార్డు వరించింది. నిజామాబాద్‌లోని సంగీత్ కల్చరల్ అకాడమీ వార్షికోత్సవంతో భాగంగా వివిధ రంగాలలో చేస్తున్న సేవలకు గానూ గోపికి అవార్డు ప్రదానం చేశారు. సినీ రచయిత కాసర్ల శ్యామ్, నిజామాబాద్ కమిషనర్ మకరంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ 1, తెలుగు 2, హిందీ 1, హిస్టరీ 1, ఎకనామిక్స్ 2, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 2, గణితం 2, భౌతికశాస్త్రం 3, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ 1, జువాలజీ 1 సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పీజీలో 55 శాతం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. తమ ధ్రువపత్రాలతో ఈనెల 4న కళాశాలలో దరఖాస్తులు అందించాలని, 6న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

నిర్మల్‌టౌన్: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదీ, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పుచెప్పారు. కోర్టు సమన్వయల అధికారి డల్లుసింగ్ కథనం ప్రకారం..కుంటాల మండలం రాజాపూర్ తండాకు చెందిన చావాన్ సుధాకర్ ఏ పని చేయకుండా తిరుగుతుండేవాడు. ఫిబ్రవరి 16, 2020న అదే గ్రామానికి చెందిన జాదవ్ సంజయ్, సుధాకర్‌కు బియ్యం బస్తా విషయంపై గొడవ జరిగింది. అదేరోజు సుధాకర్ సంజయ్ ఇంటికి వెళ్లి కుటుంబీకులను దుర్భాషలాడి కొట్టాడు. దీంతో పెద్దమనుషులు వచ్చి సర్దిచెప్పారు. ఈ విషయాన్ని సుధాకర్ మనసులో పెట్టుకుని సంజయ్ కుమారుడు ఇతిష్‌ను మరుసటి రోజు చేనులోకి తీసుకెళ్లి బండరాయితో కొట్టి చంపాడు. సంజయ్ ఫిర్యాదుతో అప్పటి సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి, కోర్టులో హాజరుపర్చారు. పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 13 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువుతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు.

పెంపుడు కుక్కను ముస్తాబు చేసి..ఊరేగింపు



తాంసి: సాధారణంగా పొలాల అమావాస్య అంటే రైతులు ఎద్దులను ముస్తాబు చేసి ఊరేగిస్తారు. అయితే ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రైతు బక్కి అశోక్ తన పెంపుడు కుక్కను సైతం ఇలా అలంకరించి బసవన్నలతో కలిపి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



కదం భోజరాం (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన యువకుడు కదం భోజరాం(28) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కథనం ప్రకారం.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భోజరాం ఆదివారం రాత్రి ఇంటిపై రేకులు సరిచేస్తున్నాడు. ఈక్రమంలో రేకులకు తెగిన విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై కింద పడి మృతిచెందాడు. తల్లి అన్నబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి మరొకరు..

నర్సాపూర్(జి): ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన రామనోల్ల వెంకటేశ్ (24) ఆదివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. తండ్రి గంగాధర్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. కుస్లి శివారులోని గంగాధర్‌కు చెందిన వ్యవసాయ పొలంలో పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతకగా బావిలో మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సంకల్పమే ఆయుధమైతే విజయం



సంకల్పం గట్టిదైతే మనిషి ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చని.. ఏ పనైనా అలవోకగా చేయవచ్చని నిరూపిస్తున్నారు ఆదిలాబాద్ పట్టణం కోలిపురకు చెందిన విజయ్‌కుమార్. ప్రస్తుతం చిన్నపాటి సమస్యలకే కుంగిపోతున్న యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వినాయక విగ్రహాల తయారీలో మంచి గుర్తింపు సాధించాడు. నాలుగేళ్ల క్రితం విగ్రహాల తయారీ సమయంలో గ్యాస్‌పేలి ప్రమాదం సంభవించింది. దీంతో చేయి కోల్పోయాడు. అయినప్పటికీ సంకల్పాన్ని మాత్రం వీడలేదు. విధి వంచించినా... పట్టు వదలని విక్రమార్కుడిలా మూడేళ్ల నుంచి పర్యావరణ హిత మట్టి విగ్రహాలు తయారు చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఇరవై ఫీట్లకు పైగా ఉన్న భారీ వినాయకులను ఒంటి చేత్తో రూపొందిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలోని ఉమ్మెడ ఉమామహేశ్వరుని ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతికి సోమవారం ఆలయం నీట మునిగింది.



ఎస్సారెస్పీలో బ్యాక్‌వాటర్ నీరు చేరడంతో ఆలయం పూర్తిగా నీట మునిగి కనిపిస్తోంది.



అధికారులూ.. ఇదేం తీరు!

సారంగపూర్: నిరాశ్రయులకు అండగా ఉండాల్సిన జిల్లా బాలల పరిరక్షణ అధికారులు..వారు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తిరుమలచారికి గత నెల 28న మతిస్థిమితం లేని మహిళ ఇద్దరు చిన్న పిల్లలతో భిక్షాటన చేస్తూ కనిపించింది. ఆయన తన 'ఎక్స్'ఖాతాలో పోస్టు చేసి కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ట్యాగ్ చేశాడు. స్పందించిన కలెక్టర్.. వారికి రక్షణ కల్పించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారులను ఆదేశించింది. వెంటనే వారు ఇక్కడికి వచ్చి తీసుకెళ్లారు. బాలిక(7)ను స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. కాగా సదరు మహిళ కౌట్ల(బి)లో, వంజర్‌లో భిక్షాటన చేస్తూ పలువురి కంటపడింది. దీంతో ప్రజలు..తిరుమలాచారికి సమాచారం అందించారు. ఈయన ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం చేరవేశారు. సోమవారం సదరు మహిళను, ఇద్దరు పిల్లలను బాలల పరిరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ విషయమై బాలల పరిరక్షణ అధికారి మురళిని వివరణ కోరగా పిల్లలతో ఇక్కడ ఉండలేనని మహిళ గొడవ చేసి వెళ్లింది. ఆమెకోసం గాలించగా సమాచారం తెలియడంతో మళ్లీ తీసుకెళ్లామని బదులిచ్చారు.



వంజర్‌లో మహిళ, పిల్లలతో అధికారులు

దేశ రక్షణకు నడుం బిగించాలి



ఎన్‌సీసీ కేడేట్లతో సైనికాధికారులు, సైనికులు

- మేజర్ అభిజిత్ సింగ్
- ఆదిలాబాద్‌కు చేరిన టెరిటోరియల్ ఆర్మీ సైకిల్ ర్యాలీ

ఆదిలాబాద్: టెరిటోరియల్ ఆర్మీలో భాగస్వామ్యులై యువత దేశ రక్షణకు నడుంబిగించాలని మేజర్ అభిజిత్‌సింగ్ అన్నారు. టెరిటోరియల్ ఆర్మీ (టీఏ) స్థాపించి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధక్షేత్రం సియాచిన్ గ్లేసియర్ నుంచి భారత దక్షిణ సరిహద్దు ఇందిరా పాయింట్ వరకు టీఏ సైనికులు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకోగా, ఎన్సీసీ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిజిత్ సింగ్ మాట్లాడుతూ టీఏ అవశ్యకతను తెలియజేయాలనే ఉద్దేశంతో 5,500 కి.మీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సైకిల్ యాత్ర జూలై 30న ప్రారంభమైందన్నారు. సైనికుల అధికారి సావంత్, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్లు పాల్గొన్నారు.

కిరాణాషాపులో చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: కిరాణా షాపులో చోరీకి పాల్పడిన మరో నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు రోజుల కిందట చోరీ జరిగింది. ఆదివారం ఓ నిందితుడిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన అర్షద్‌ను సోమవారం పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



భూమేశ్ మృతదేహం

బోథ్: జీవితంపై విరక్తితో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని రాసిమెట్ల గ్రామానికి చెంది న ఎర్రం భూమేశ్ కుటుంబం గతకొంత కాలంగా బోథ్ మండల కేంద్రంలోని న్యూకాలనీలో స్థిరపడింది. గత నాలుగేళ్లక్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో తమ్ముడు రమేశ్‌తోపాటు కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనంలోని గదికి వెళ్లగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. తమ్ముడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని భర్త..

తాంసి: భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని ప్రచారం జరగడంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కప్పర్ల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శివరాం కథనం ప్రకారం..గ్రామానికి చెందిన బోజ్జ రవీందర్(32) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని ప్రచారంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తల్లి రాంబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.